నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 27 నవంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

2న లగచర్ల లడాయి

- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కార్యక్రమ నిర్వహణ
- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజనులతో భారీ నిరసన ప్రదర్శన
- లగచర్ల బాధితులకు సంఘీభావం • ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు

మహబూబ్‌నగర్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కొడంగల్ నియోజకవర్గం లగచర్ల బాధితులకు సంఘీభావంగా డిసెంబర్ 2న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపడుతున్నారు. సీఎం రేవంత్ నియోజకవర్గంలో ఫార్మా క్లస్టర్ ఏర్పాటు కోసం అమాయకులైన గిరిజనుల భూములను లాక్కోవడాన్ని నిరసిస్తూ వాళ్లంతా తిరగబడితే వారిపై అన్యాయంగా అక్రమ కేసులు బనాయించి జైల్లోకి పంపించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఫార్మా క్లస్టర్ రద్దు.. లగచర్ల బాధితులకు న్యాయం.. జైల్లో ఉన్న వారిని వెంటనే విడుదల చేయాలని.. అరెస్టులు ఆపాలని.. డిమాండ్ చేస్తూ భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఇతర జిల్లా ముఖ్య నేతలు పాల్గొంటున్నారు. లగచర్ల లడాయి పేరుతో జరిగే కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున గిరిజనులు, గిరిజన సంఘాలను ఏకం చేస్తూ ఈ ప్రదర్శన చేపడుతున్నారు. దీని కోసం మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గిరిజన నేతలతో సమావేశమయ్యారు. పెద్దఎత్తున ప్రదర్శన చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటినుంచే చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లంబాడ సోదరులను ఏకం చేసేందుకు నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సీఎం సొంత జిల్లాలో లగచర్ల లడాయి నేపథ్యంలో ప్రభుత్వం అనుమతిస్తుందా.. నిరాకరిస్తుందా.. అనేది సందేహాస్పదంగా మారింది. బాధితులకు బాసటగా నిలిచేందుకు నేతలు పిలుపునిస్తున్నారు.

కార్యకర్తలే మా బలం

- రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ పాత్రపై వివరిస్తాం
- దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి కర్నె ప్రభాకర్
- విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే విజయుడు
- గద్వాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కర్నె ప్రభాకర్

గద్వాల, నవంబర్ 26 : జిల్లాలో బీఆర్ఎస్‌కు తెగింపు ఉన్న కార్యకర్తలు ఉన్నారని, వారే తమ బలమని దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తెలిపారు. పార్టీలోకి చాలా మంది వస్తుంటారు.. పోతుంటారు.. కానీ, అసలైన కార్యకర్తలు పార్టీ కోసం పనిచేస్తారన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సీనియర్ నాయకుడు హనుమంతునాయుడు ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇందుకు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్, రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ 2009లో కేసీఆర్ తన ప్రాణాలు ఫణంగా పెట్టి దీక్ష చేపట్టి ఢిల్లీ కండ్లు తెరిపించడంతో తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించారన్నారు. దీనికి విజయసూచకంగా ఏటా నవంబర్ 29న దీక్షాదివస్ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 29న రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్రపై ప్రజలకు పూర్తి స్థాయిలో వివరిస్తామన్నారు. తొలితెలంగాణ ఉద్యమంలో ఎంతోమంది ప్రాణత్యాగాలు చేసినా అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం ఏర్పాటు చేయలేదన్నారు. మలిదశ ఉద్యమంలో కేసీఆర్‌కు ప్రజలతోపాటు విద్యార్థులు, కార్యకర్తలు, మేధావులు సహకరించడంతో సుసాధ్యం అనుకున్న తెలంగాణను సాధించారన్నారు. ఆర్డీఎస్ రైతుల సాగునీటి సమస్య, సీమాంధ్ర పాలకులు బాంబులు వేసి పట్టర్లు ధ్వంసం చేయడం వంటి వాటిని స్వయంగా తెలుసుకునేందుకు కేసీఆర్ పాదయాత్ర చేపట్టాడని గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ తెగింపు నేటితరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

భారీగా తరలిరావాలి : విజయుడు

కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్కచేయక 11 రోజులు పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. సాధించిన తెలంగాణను బంగారు తెలంగాణగా రూపుదిద్దడంలో సఫలీకృతుడు అయ్యాడని చెప్పారు. దీక్షాదివస్‌లో ప్రజలు, కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్న రేవంత్ : ఆంజనేయగౌడ్

కేసీఆర్ ఢిల్లీ పెద్దల మెడలు వంచి తెలంగాణను సాధిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. గతంలో ఇక్కడ సరైనా సాగునీటి వసతి లేక ఇక్కడి ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారిని అయితే రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణకు ఇతర ప్రాంతాల నుంచి కూలీలు వలసవచ్చి జీవనం గడుపుతున్నారన్నారు. ఇక్కడి వలసలు ఇక్కడి ప్రజల సమస్యలు తెలుసుకొని వలసలు ఆపడానికి కేసీఆర్ పాదయాత్ర చేశారన్నారు. ఆదిలా బాద్ నుంచి అలంపూర్ వరకు కేసీఆర్‌కు పూర్తి అవగాహన ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం దీక్షబూని తెలంగాణ సాధించిన కేసీఆర్ విజయాలకు సూచకంగా దీక్షా దీవస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడడానికి ఢిల్లీ మెడలు వంచిన నాయకుడు కేసీఆర్ అన్నారు. మోదీ, చంద్రబాబు డైరెక్షన్‌లో తెలంగాణ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు రైతు భరోసా అందక, రుణమాఫీ కాక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు అశోక్‌కుమార్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కుర్వ పల్లయ్య, బస్వరాజ్, కిశోర్‌కుమార్, శ్రీరాములు, బీచుపల్లి, ప్రేమలత, రాముడు, రహమాన్, గోవర్ధన్, మోనేశ్, రాము, రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో జిల్లా ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

పాలమూరు దద్దరిల్లాలి

- 29న దీక్షాదివస్‌ను ఘనంగా నిర్వహిద్దాం
- చావు నోట్లోకి వెళ్లి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన కేసీఆర్
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- త్యాగాల పునాదులపై ఎగిరిన బీఆర్ఎస్ జెండా
- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి
- ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన కేసీఆర్
- మాజీ ఎమ్మెల్యే ఆల
- హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జి క్యామ మల్లేశ్

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 26 : తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పి.. ఉద్యమ నాయకుడు కేసీఆర్ చేపట్టిన దీక్షకు దిగివచ్చిన కేంద్రం తెలంగాణపై ప్రకటన చేసిందని.. దాన్ని గుర్తు చేస్తూ ఈనెల 29న చేపట్టే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్షా దివస్ విజయవంతానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ హాజరయ్యారు. నవంబర్ 29, 2009న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షను మరొక్కసారి యాది చేసుకుంటూ బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఈ నెల 29న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో దీక్షాదివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిద్దామన్నారు. కేసీఆర్ తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ, ఉద్యమ స్ఫూర్తిని ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీక్షా దివస్‌లో భాగంగా నిర్వహించాల్సిన విధివిధానాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, గణేశ్‌తోపాటు పలు వార్డు నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్ష చేయకుంటే తెలంగాణ వచ్చేదా? : శ్రీనివాస్‌గౌడ్

తెలంగాణ మలిదశ పోరాటానికి కేసీఆర్ చేపట్టిన దీక్ష కారణమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దీక్షకు పూనుకున్నారని.. నవంబర్ 29న దీక్ష ప్రారంభిస్తే.. డిసెంబర్ 9న కేంద్రం దిగివచ్చి ప్రకటన చేసిందన్నారు. కేసీఆర్ దీక్షకు కేంద్రం వణికిపోయి.. ప్రొఫెసర్ జయశంకర్‌కు రాయభారం పంపిందని.. తెలంగాణ ఇచ్చేందుకు కేంద్రం సుముఖంగా ఉందని ఎలాంటి ప్రకటన చేస్తే కేసీఆర్ దీక్ష విరమిస్తారో ఆ ప్రకటన చేస్తామని చెప్పారన్నారు. దివంగత జయశంకర్ అప్పట్లోనే నోట్ తయారు చేసి కేంద్రానికి పంపారని అదే నోట్‌ను చిదంబరం ఢిల్లీలో చదివి వినిపించారన్నారు. ఆ తర్వాత కేసీఆర్ దీక్ష విరమింపజేశారని తెలంగాణ సాధనకు ఈ దీక్ష చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ త్యాగాన్ని గుర్తు చేసుకునేందుకే దీక్షాదివస్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ త్యాగ ఫలితమే తెలంగాణ : లక్ష్మారెడ్డి

ఎన్నో త్యాగాల పునాదులపై బీఆర్ఎస్ జెండా ఎగిరిందని, కేసీఆర్ చేసిన త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ఈనెల 29న మహబూబ్‌నగర్‌లో చేపట్టే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పుట్టినప్పటినుంచి ఎంతో మంది వచ్చారు ఎంతోమంది వెళ్లారు. కార్యకర్తలు జెండాలు మోస్తూనే ఉన్నారు. అందరికీ అవకాశాలు రావు వచ్చిన వాళ్లు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. పార్టీ క్రమశిక్షణలో తప్పితే ఎంతటి వారినైనా సస్పెండ్ చేస్తాం అంటూ హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ ఘన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వానికి ఎప్పుడు బాసటగా ఉంటారని ఆ పరిస్థితి మళ్లీ రాబోతుందన్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

ప్రజలే బుద్ధి చెప్పాలి

- కాంగ్రెస్ అహంకారంపై తిరగబడే రోజులొచ్చాయి
- తెలంగాణ వాదాన్ని అణచివేయాలని చూసిన యూపీఏ సర్కారు
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు
- అబద్దాలతో అధికారంలోకి.. : దీక్షాదివస్ ఇన్‌చార్జి విజయసింహారెడ్డి
- హామీల నిలబెట్టినీ అమలు చేయాలి : మాజీ ఎమ్మెల్యే బీరం

నాగర్‌కర్నూల్, నవంబర్ 26 : ఎన్నో పోరాటాలు చేసి.. చావు అంచుల దాకా వెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ వంటి మహనీయుడి ఆనవాళ్లు లేకుండా చేస్తానంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, దీక్షాదివస్ ఇన్‌చార్జి విజయసింహారెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గువ్వల మాట్లాడుతూ మలి విడుత తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ నాయకత్వంలో పోరాటాలు చేసినా.., ఎందరో బలిదానాలు చేసుకున్నా అప్పటి యూపీఏ సర్కారుకు కనువిప్పు కలగలేదని, తెలంగాణవాదాన్ని అణచివేయాలని కుట్ర చేసిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారని.. దానినే మనం దీక్షాదివస్‌గా జరుపుకొంటున్నామన్నారు. ఈ నెల 29వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాడు తెలంగాణ పదాన్ని ఉచ్చరించని వారికి అప్పటి ఆంధ్రా నాయకత్వానికి తెలంగాణ ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా వారి శిష్యరికం తీసుకున్నాడని.., అందుకే కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటూ నిర్బంధాలను సాగిస్తున్నారన్నారు. స్వేచ్ఛ నెల కొసాలంటే త్యాగాలు, ప్రజా పోరాటాలు తప్పవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దీక్షాదివస్‌ను నిర్వహించాలని ఆదేశించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాదికాలం ఇవ్వాలని కేసీఆర్ సూచించారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విచ్ఛలవిడితనం, అహంకారం, దుర్మార్గాలపై ప్రజలు తిరుగుబాటుచేసే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కేటీఆర్ పిలుపుమేరకు నాగర్‌కర్నూల్‌లోని పార్టీ కార్యాలయంలో 5 వేల మందికి తగ్గకుండా నభూతో నభవిష్యత్తు అనేరీతిలో దీక్షాదివస్ చేపడతామన్నారు. మాజీ ఎమ్మెల్యేలతో కలిసి విజయసింహారెడ్డిఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, నర్సింహ, చంద్రశేఖర్ రెడ్డి బాబురావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మొద్దు : విజయసింహారెడ్డి



దీక్ష ద్వారా తెలంగాణను సాధించుకున్న విషయం ప్రజలందరికీ తెలుసునని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి విజయసింహారెడ్డి తెలిపారు. 14 ఏండ్లపాటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వీరోచితంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోయి రాష్ట్రాన్ని సాధించారన్నారు. సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణకు ఒక్కరూపాయి కూడా ఇచ్చేది లేదన్నాడని.., ఆ సమయంలోనే కేసీఆర్ ఎలాగైతే తెలంగాణ సాధించాలని దీక్ష బూనారన్నారు. ఆ పోరాటాన్ని గుర్తు చేసుకునేందుకు దీక్షాదివస్ చేపట్టడం జరిగిందన్నారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు. ఏడాది కాలంలో ముఖ్యమంత్రి పదవినే అప్రతిష్టపాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఒక్కసారిగా ఏ విధంగా మారిపోయిందనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, రేవంత్‌రెడ్డి చేతల ముఖ్యమంత్రి కాదని, నోటిదురుసు ఉన్న వ్యక్తి అని అన్నారు. పదవికి మచ్చతెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

హామీలను అమలు చేయాలి : బీరం

కేటీఆర్ ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ తెలంగాణ భవన్‌లో 29న దీక్షాదివస్ నిర్వహిస్తున్నట్లు కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని పదేండ్లపాటు కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి 20 ఏండ్లు వెనక్కి పోయిందన్నారు. దీక్షాదివస్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కొల్లాపూర్ పట్టణాభివృద్ధికోసం రూ.25 కోట్లు, పాలిటెక్నిక్ కళాశాలను తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేశారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా, కొవిడ్ విజృంభిస్తున్న సమయంలోనూ కేంద్రంతో మాట్లాడి కొల్లాపూర్ ప్రాంతానికి జాతీయ రహదారి తీసుకొచ్చామన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. తాము తీసుకొచ్చిన పాలిటెక్నిక్, హార్టికల్చర్ కాలేజీ ఊసే లేదన్నారు. మినీ లిఫ్టులు మంజూరు చేసినా వాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చట్నీ, సాంబార్‌లో బొద్దింకలు

- మహబూబ్‌నగర్ ఎస్సీ బాలికల హాస్టల్‌లో కలకలం
- తీవ్రంగా మండిపడుతున్న విద్యార్థి సంఘాలు
- అధికారుల తనిఖీపై వెళ్లువెత్తుతున్న సందేహాలు

బొద్దింక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 26 : పాలమూరులోని కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో మంగళవారం సాంబారు, చట్నీలో బొద్దింక రావడం కలకలం రేపింది. దీంతో విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీఎంహెచ్‌వో కృష్ణ, మహబూబ్‌నగర్ అర్బన్ తాసీల్దార్ ఘన్సీరాం తనిఖీ చేసి నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. సిబ్బంది తక్కువగా ఉండడం, ప్రధానంగా వారికిచ్చే అరకొర వేతనాలు సరిపోక పోవడంతో శుభ్రతపై దృష్టి సారించడం లేదు. సిబ్బంది చాలా వరకు సివిల్ సప్లయ్ అధికారులు సరఫరా చేసిన బియ్యం నేరుగా నానబెట్టి.. వండి వడ్డిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాటిని చెరిగి, పురుగులు ఇతరత్రా చెత్తా చెదారం తీసి మళ్లీ శుభ్రపర్చాల్సి ఉంటుంది. నాసిరకమైన కూరగాయలు, గుడ్లు అందించడం కూడా ఫుడ్ పాయిజనింగ్‌కు కారణాలుగా చెప్పొచ్చు. కాగా, సాంబారులో బొద్దింక వచ్చిందంటే ప్లేట్‌లోంచి పడేసి తినాలని సిబ్బంది చెబుతుండడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని బీఆర్ఎస్వీ పీయూ కన్వీనర్ భరత్ బాబు అన్నారు. అధికారులు తూతూ మంత్రంగా తనిఖీ చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం తగదన్నారు. సాంబారు, అన్నంలో పురుగులు వచ్చినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ తెలిపారు. ఈ విషయమై వంట సిబ్బందిని అడిగితే ఇంట్లో వస్తే తీసేసి తినమా అంటూ విద్యార్థులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, విద్యార్థులు అన్నం, సాంబారు పెట్టుకొని వెళ్లే సందర్భంలో ప్లేట్‌లో బొద్దింక పడిందని, ఫిర్యాదు చేస్తే మళ్లీ వండించి భోజనం వడ్డించామని ఎస్సీ కళాశాల వసతిగృహ అధికారి తారాబాయి చెప్పడం గమనార్హం.

బాలికల వసతిగృహ వార్డెన్ బదిలీ

మహబూబ్‌నగర్ ఎస్సీ బాలికల హాస్టల్ అపరిశుభ్రంగా ఉండడాన్ని అధికారులు గుర్తించి కలెక్టర్‌కు నివేదించారు. దీంతో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న కుక్‌ను తొలగించాలని, హెచ్‌డబ్ల్యూవోను బదిలీ చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశాలు జారీ చేశారు.

మళ్లీ ఫుడ్‌పాయిజన్

- మాగనూర్ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు అస్వస్థత
- 27 మందిని మక్తల్, పాలమూరు దవాఖానలకు తరలింపు
- ఇద్దరి పరిస్థితి విషమం, అదనపు కలెక్టర్ విచారణ
- వంట నిర్వాహకులు, టీచర్లను విచారిస్తున్న డీఎస్పీ
- కిరాణాషాపులో జంక్‌ఫుడ్‌పై ఎస్‌బీ సీఐ విచారణ

మాగనూర్, నవంబర్ 26 : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మూడో సారి ఫుడ్ పాయిజన్ అయ్యింది. పాఠశాలలో 597 విద్యార్థులకుగానూ 400 మంది హాజరయ్యారు. వారం రోజులుగా ఇన్‌చార్జి తాసీల్దార్ సురేశ్‌కుమార్ సమక్షంలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. మంగళవారం మహిళా సంఘం ఎంపిక చేసిన ఏజెన్సీ ద్వారా వంట చేయగా.. సురేశ్‌కుమార్, ఉపాధ్యాయులు తనిఖీ చేశారు. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయగా.. మూడు గంటల సమయంలో వాంతులు, కడుపునొప్పి, చలి జ్వరంతో బాధపడ్డారు. గమనించిన ఉపాధ్యాయులు బైకులపై మాగనూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాదాపు 27 మంది విద్యార్థులను అంబులెన్స్‌లో తరలించేందుకు ఎదురు చూడగా.. ఎంతకూ రాక పోవడంతో గ్రామస్తులు కార్లలో మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎక్కడ పోరపాటు జరిగి ఫుడ్ పాయిజన్ అవుతుందో తెలియడం లేదని సురేశ్ చెబుతున్నారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలం మాగనూరుకు చేరుకొని ఫుడ్‌పాయిజన్‌పై విచారణ చేపట్టారు. వంట నిర్వాహకులు, ఉపాధ్యాయులను డీఎస్పీ లింగయ్య పోలీస్టేషన్‌కు పిలిపించారు. కాగా, విద్యార్థులు జంక్‌ఫుడ్ తినడం వల్లే అస్వస్థతకు గురయ్యారని కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పడంతో ఎస్‌బీ సీఐ రాంలాల్ పాఠశాల పరిసరాల్లోని కిరాణాషాపుల యజమానులతో విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా, జెడ్పీ హెచ్‌ఎస్‌లోని వాటర్ ట్యాంక్ నీటిని శాంపిల్ కోసం సేకరించారు.

జాడలేని ఫుడ్ ఇన్‌స్పెక్టర్..

అధికారులు చెబుతున్న ప్రకటనలపై విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. తమ పిల్లలు బయట ఏమీ తినకుండా చూడాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసి శాంపిల్స్ కూడా తీసుకోలేదు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఆయా దుకాణాల్లో విచారణ చేపట్టారు. చివరకు రాత్రి ఏడున్నర గంటలకు ఫుడ్ సేఫ్టీ అధికారి అక్కడికి చేరుకున్నారు.

డీఎంహెచ్‌వో ఆరా..

మక్తల్, నవంబర్ 26 : మక్తల్ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు చదువుకొని మంచి ప్రయోజకులు కావాలని పాఠశాలకు పంపిస్తే ఇలా ఎందుకు చేస్తున్నారంటూ విలపించారు. విషయం తెలుసుకున్న డీఎం హెచ్‌వో సౌభాగ్యలక్ష్మి దవాఖానకు చేరుకొని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్యం కుదుటపడే వరకు వైద్యులు దవాఖానలోనే ఉండాలని ఆదేశించారు. అయితే, తీవ్ర అస్వస్థతకు గురైన నేత్ర, దీపికను మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు రెఫర్ చేశారు.

మహబూబ్‌నగర్‌కు తరలింపు..

మహబూబ్‌నగర్, నవంబర్ 26 : మాగనూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానకు తరలించారు. వీరికి వైద్యులు పలు టెస్టులు చేసి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి మెరుగ్గా ఉందని ఆర్ఎంవో శిరీష తెలిపారు. విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి విద్యార్థులను పరామర్శించారు.

పాఠశాలను పర్యవేక్షించిన అధికారులు..

నారాయణపేట, నవంబర్ 26 : మాగనూరు జెడ్పీ హెచ్‌ఎస్‌ను అధికారులు, ఉపాధ్యాయులు, విలేకరులు స్వయంగా పర్యవేక్షించి విద్యార్థులతో కలిసి ఆహారాన్ని భుజించినట్లు కలెక్టర్ సిక్తాపట్నాయక్ తెలిపారు. 22 మంది విద్యార్థులకు కడుపునొప్పి, వాంతులు, వికారంగా ఉన్నట్లు నివేదించారు. మధ్యాహ్న భోజనంలో అన్నం, పప్పు, వంకాయ కూర వడ్డించారని చెప్పారు. అధికారులతో పాటు ఐదుగురు విద్యార్థులు, సిబ్బంది విద్యార్థులకు వడ్డించిన ఆహారాన్ని తిన్నారన్నారు. బియ్యం స్టాక్‌ను మార్చామని, కొత్త స్టాక్ వినియోగించామని, బయటి ఏజెన్సీ నుంచి కొనుగోలు చేసిన శుద్ధి చేసిన నీటినే వంటకు వాడినట్లు పేర్కొన్నారు. భోజనానికి ముందు దుకాణాలు,